


ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 46
సంచిక : 177
పేజీలు : 3
గురువారం, మార్చి 19, 2026
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ




## విద్యార్థుల పఠన సామర్థ్యంపై
# ప్రత్యేక దృష్టి సారించాలి..





**- జిల్లా కలెక్టర్ అంకిత్**

**టి మీడియా, మార్చి 18, టేకులపల్లి :** జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం టేకులపల్లి మండలంలో విస్తృత స్థాయిలో ఆకస్మిక పర్యటన నిర్వహించారు. ఈ పర్యటనలో పదవ తరగతి పరీక్షలు, విద్యార్థుల పఠన సామర్థ్యం, పాఠశాల మౌలిక సదుపాయాలు, ప్రజలకు అందుతున్న వైద్య సేవల నిర్వహణను సమగ్రంగా తనిఖీ చేశారు.ముందుగా టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్షలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ విధానం, విద్యార్థుల హాజరు శాతం, పర్యవేక్షణ చర్యలను సమీక్షించి, విద్యార్థులకు అందుతున్న మౌలిక సదుపాయాలపై సంబంధిత ఉపాధ్యాయుల నుండి వివరాలు పొందారు. ఈ పరీక్షా కేంద్రంలో 180 మంది విద్యార్థులు కేటాయించగా అందరూ హాజరయ్యారని అధికారులు కలెక్టర్ కు తెలిపారు. కలెక్టర్ అన్ని ఏర్పాట్లు సమగ్రంగా ఉండి ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించబడేలా చూడాలని సూచించారు. మాస్ కాపీయింగ్‌కు ఏవైనా అవకాశాలు ఉండకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ చేపట్టాలని, పరీక్షా పత్రాల నిర్వహణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టంగా ఆదేశించారు. అదనంగా, ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్షా కేంద్రాలకు అనుమతించరాదు అని హెచ్చరించారు.పాఠశాల భవనాలను పరిశీలించిన సందర్భంలో స్లాబ్ పెచ్చులు ఊడిపోవడం, ఆవరణలో పరిశుభ్రతలేమి ఉండటం గమనించి అసంతృప్తి వ్యక్తం చేశారు. వెంటనే పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టి, భవనాలకు అవసరమైన మరమ్మత్తులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పరీక్షల సమయంలో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ స్పష్టంగా సూచించారు.అనంతరం కోయగూడెం ప్రాథమిక బాలుర ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి, తరగతి గదులను సందర్శించారు.

మిగతా 3లో






## తోగ్గూడెం అక్రమ మైనింగ్ వ్యవహారంపై విచారణ జరపాలి

**బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు**

**టి మీడియా, మార్చి 18, పాల్వంచ :** మండలంలోని తోగ్గూడెం గ్రామంలో జరిగిన అక్రమ మైనింగ్ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పొనిశెట్టి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మంగళవారం పాల్వంచ ప్రెస్ క్లబ్లో బీజేపీ నాయకులతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాల్వంచ మండలంలోని తోగ్గూడెం గ్రామంలో అనేక సంవత్సరాలుగా సుమారు 10 క్వారీలు , 7 నుండి 8 క్రషింగ్ మిల్లులు నడుస్తున్నాయన్నారు.ఈ క్వారీలు అమాయక గిరిజనులను అడ్డం పెట్టుకొని ప్రభుత్వం నుండి అనుమతులు పొంది కొందరు

మిగతా 3లో





## స్మార్ట్ కిడ్జ్ లో ఉగాది వేడుక

**టీ మీడియా,మార్చి18,ఖమ్మం** :స్థానిక స్మార్ట్ కిడ్జ్ పాఠశాలలో తెలుగు సంవత్సరాది పర్వదినం శ్రీ పరాభవ నామ ఉగాది వేడుకలు సాంప్రదాయబద్ధంగా నిర్వహించారు. పాఠశాల విద్యార్థులు పంచకట్టు, చీరకట్టు, లంగా ఓని తెలుగు సాంప్రదాయ దుస్తులలో మురిసిపోయారు. తొలుత సూర్య భగవానుడికి, ప్రకృతి మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం షడ్రుచులతో ఉగాది పచ్చడి తయారు చేశారు. అనంతరం విద్యార్థులందరికీ ఉగాది పచ్చడి అందించారు. పాఠశాలను సాంప్రదాయకరంగా మామిడాకులు, కొబ్బరాకులతో శోభాయ మానంగా తీర్చిదిద్దారు. అనంతరం పాఠశాల చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తెలుగు సాంప్రదాయ పర్వదినాలలో ఉగాది పర్వదినం తొలి రోజులలో వచ్చే పర్వదినమని, ఈ పర్వదినాన్ని తెలుగు సంవత్సరాదిగా తెలుగు లోగిళ్లలన్నింటిలో జరుపుకుంటున్నామని తెలిపారు. ఈ పర్వదినం రోజు నాటికి ప్రకృతి మాత నూతన శోభను సంతరించుకుంటుందని తెలిపారు. ఈ తెలుగు సంవత్సరాదిని శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సరంగా పిలుస్తారు. 60 సంవత్సరాల తెలుగు సంవత్సరాల లో 33వ తెలుగు సంవత్సరం ఈ పరాభవనామ తెలుగు సంవత్సరాన్ని ప్రస్తుతం జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. తెలుగువారి కుటుంబాలు అన్నింటిలో నూతన శోభ వెల్లివిరియాల అని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.




## డిప్యూటేషన్లపై అనుమానాల మేఘం

**-అధికారుల మౌనం అనుమానాస్పదం**

**-స్పష్టత లేని నిర్ణయాలతో ఉద్యోగుల్లో ఆందోళన**

**టీ మీడియా,మార్చి18,సింగరేణి(కారేపల్లి)**ఖమ్మం: ఖమ్మం జిల్లాలో ఇప్పటికే డిప్యూటేషన్ బదిలీల వ్యవహారం గందరగోళానికి దారితీస్తుండగా, సంబంధిత అధికారుల మౌనం మరింత అనుమానాలకు తావిస్తోంది. బదిలీల విషయంలో స్పష్టమైన మార్గదర్శకాలు లేకుండా నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరికి ప్రాధాన్యత ఇచ్చి, మరికొందరిని పక్కన పెట్టడం వల్ల ఉద్యోగుల్లో అసంతృప్తి పెరుగుతోంది.ప్రభుత్వ నిబంధనలను పక్కన పెట్టి, వ్యక్తిగత అనుకూలతలతోనే బదిలీలు జరుగుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా ఒకే మండలంలో సంవత్సరాలుగా పనిచేస్తున్న వారికి సడలింపులు ఇస్తూ, కొత్తగా వచ్చిన వారిపై ఒత్తిడి పెంచుతున్నట్లు సమాచారం. దీంతో పారదర్శకతపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఈ వ్యవహారంపై సంబంధిత శాఖ అధికారులు స్పందించకపోవడం గమనార్హం. పలు సార్లు వివరణ కోరినా, ఎలాంటి సమాధానం ఇవ్వకపోవడం విమర్శలకు దారి తీస్తోంది. జిల్లా స్థాయిలో సమగ్ర విచారణ జరిపించి, అర్హులైన వారికి న్యాయం చేయాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని, డిప్యూటేషన్ బదిలీలలో పారదర్శకత తీసుకురావాలని బాధితులు కోరుతున్నారు. లేకపోతే ఈ వివాదం మరింత ముదిరే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

## ఉద్యోగం రావడంలేదని యువతి ఆత్మహత్య

**టి మీడియా, మార్చి 18, ఖమ్మం రూరల్ :** ఉద్యోగం రావడం లేదని తీవ్ర మనస్థాపనతో ఓ యువతి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని తెల్దారుపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. యువతి తల్లి ఉన్నం రమణమ్మ, రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తెల్లారుపల్లి గ్రామానికి చెందిన ఉన్నం భవాని (25) పీజీ చదివింది. కొంతకాలంగా ఇంటి వద్దే ఉంటూ పోటీ పరీక్షలకు సన్నద్ధమౌతుంది. ఎటువంటి నోటిఫికేషన్ రాకపోవడం, ఉద్యోగం ఇక రాదేమోననే బెంగతో తీవ్ర మనస్తాపం చెంది మంగళవారం ఉదయం గడ్డి మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఫలితం లేదని ఇంటికి తీసుకెళ్లమని సూచించారు. దాంతో ప్రభుత్వాసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో బుధవారం ఉదయం మృతి చెందింది. యువతి తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# హక్కుల సాధనకై ఆశా వర్కర్లు పోరాడాలి

**ఏఐటియుసిరాష్ట్ర కన్వీనర్ కవిత**

**టి మీడియా, మార్చి 18, ఖమ్మం రూరల్:**ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను నెరవేర్చడానికి, హక్కుల సాధనకై ఆశా వర్కర్లు సంఘటన అవ్వాలని తెలంగాణ రాష్ట్ర ఆశా వర్కర్స్ యూనియన్ ( ఏఐటీయూసీ) రాష్ట్ర కన్వీనర్ నకిరేకంటి కవిత పిలుపునిచ్చారు. ఏదులాపురంలో ఖమ్మం జిల్లా ఆశా ముఖ్య కార్యకర్తల ఆమె సమావేశం అయ్యారు. 2023 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ నాయకులు తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ఆశాలకు 18,000 ఫిక్స్ డ్ వేతనాన్ని ఇస్తామని హామీలు ఇచ్చారని ఆ హామీలు ఇచ్చి మూడు సంవత్సరాలు అవుతున్న ఇంతవరకు నెరవేర్చకపోవడం బాధాకరమైన విషయం అన్నారు. ఎన్నికలకు వచ్చినప్పుడు నాయకులకు తాము గుర్తుంటామని ఎన్నికల అనంతరం మర్చిపోతుంటారన్నారు. కానీ తాము మాత్రం ఇప్పుడు కచ్చితంగా గుర్తు పెట్టుకున్నామని ఇచ్చిన హామీని నెరవేర్చకపోతే వచ్చే ఎన్నికలలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేస్తామని ఆమె ఈ సందర్భంగా హెచ్చరించారు. తమకు ఫిక్స్డ్ వేతనం అవసరం లేదని కనీస వేతనం కావాలని ఆమె ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. తాము 2006లో చేరిన తర్వాత తమని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలనే పోరాటం చేసామని ఆ పోరాటాన్ని ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయని ఇప్పుడు కనీసం కాంట్రాక్ట్ ఉద్యోగులుగా నైనా గుర్తించాలని ఆమె ఈ సందర్భంగా విన్నవించారు. కనీస వేతనంతో పాటు 10 లక్షల రూపాయల హెల్త్ ఇన్సూరెన్స్, 10 లక్షల రూపాయల లైఫ్ ఇన్సూరెన్స్ ను ప్రభుత్వమే చేర్చి ఇవ్వాలన్నారు. డ్యూటీలో మరణించిన ఆశా వర్కర్ కుటుంబాన్ని ఆదుకోవడానికి 10 లక్షల రూపాయలను ఎక్స్గ్రేషియా గా ఇవ్వాలన్నారు. ఎవరైనావ ఆశాలు ఏఎన్ఎం లేదా జిఎన్ఎమ్ చదివినప్పుడు వారికి కూడా ఆయా ప్రభుత్వ ఉద్యోగాలలో వెయిటేజీ ఇవ్వాలని ఆమె ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు.రాబోవు రోజుల్లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆశల సమస్యలపై పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని, ఆ పోరాటానికి ఆశాలు అందరూ కలిసి రావాలని ఈ సందర్భంగా ఆమె పిలుపునిచ్చారు. యూనియన్ (ఏఐటీయూసీ)రాష్ట్ర నాయకురాలు బి. ఉసేని, పాల్గొన్నారు..



అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షురాలుగా ఓరుగంటి శ్రావన్, జిల్లా ప్రధానకార్యదర్శిగా ఝాన్సీ కోశాధికారిగా జానకమ్మ ఎన్నుకున్నారు.



# మట్టి అక్రమ రవాణాపై సింగరేణి చర్యలు



**-- జెసిబి, రెండు టిప్పర్లు స్వాధీనం**

**-- పోలీసులకు ఫిర్యాదు**

**టి మీడియా, మార్చి 18, రుద్రంపూర్:** సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలపై ఎస్అండ్‌పిసి (సెక్యూరిటీ) సిబ్బంది కఠిన చర్యలు తీసుకుంది. అనుమతులు లేకుండా మైనింగ్ ప్రాంతంలోకి చొరబడి మట్టిని తరలిస్తున్న ఒక జెసిబి, రెండు టిప్పర్లను అదుపులోకి తీసుకున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 16వ తేదీ రాత్రి సుమారు 2 గంటల సమయంలో పాల్వంచ ప్రాంత నివాసి బాదుల్లాకు చెందిన జెసిబి, రెండు టిప్పర్ల సహాయంతో ధన్బాద్ పంచాయతీ మాయాబజార్ ప్రాంతంలో రైల్వే స్లైడింగ్ పనులు జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో అక్రమంగా మట్టి లోడింగ్ జరుగుతోంది. విధుల్లో ఉన్న ఎస్అండ్‌పిసి సిబ్బంది అనుమానాస్పద కదలికలను గమనించారు. మట్టి డంప్‌కు వెళ్లాల్సిన టిప్పర్ కొత్తగూడెం వైపు మళ్లడంతో అనుమానం మరింత పెరిగింది. వెంటనే జమేదార్ విక్టర్, సీతారాం, కప్పల శ్రీనివాస్ వాహనాన్ని వెంబడించి ఆపారు. వాహనం సంబంధిత అనుమతులపై ప్రశ్నించగా డ్రైవర్ వాహనాన్ని వదిలి పరారయ్యాడు.దీంతో టిప్పర్‌ను సెక్యూరిటీ కార్యాలయానికి తరలించారు. అలాగే రైల్వే పనుల వద్ద లోడింగ్‌కు సిద్ధంగా ఉన్న మరో టిప్పర్, జెసిబిని కూడా స్వాధీనం చేసుకుని ఆఫీసుకు తరలించారు. ఈ ఘటనపై సంబంధిత వ్యక్తులపై టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సెక్యూరిటీ అధికారులు తెలిపారు. అక్రమ మట్టి రవాణాపై సింగరేణి యాజమాన్యం కఠిన చర్యలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలో పనులు చేపడుతున్న సదర్ కంపెనీకి చెందిన కొందరు సూపర్‌వైజర్ల హస్తం కూడా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ వాహనం, తమ జెసిబి కాకుండా వేరే వ్యక్తులు వచ్చి మట్టిని తరలిస్తుంటే అక్కడ ఉన్న సిబ్బంది ఎందుకు అధికారులకు తెలియజేయలేదని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇది మొదటిసారి జరిగిందా? లేక నిత్యం జరుగుతున్నదా అనే విషయంపై సింగరేణి అధికారులు విచారణ చేపట్టారు.



## ముమ్మరంగా పారిశుధ్ధ్య పనులు

**-కౌన్సిలర్ చారులత ప్రభాకర్**

**టీ మీడియా, మార్చి 18, మధిర :**మున్సిపాలిటీలో పారిశుధ్ధ్యన్ని మెరుగుపరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ సంపత్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగముగా బుధవారం మధిర మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ముమ్మరంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పారిశుధ్ధ్య పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని ఆయన తెలిపారు. కౌన్సిలర్ చారులత ప్రభాకర్ మాట్లాడుతూ 9వ వార్డులో మెరుగుపరిచేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఈఓ వై ప్రభాకర్ శానిటరీ ఇన్స పెక్టర్ శివ కృష్ణ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉగాది ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

**టి మీడియా, మార్చి 18, పాల్వంచ:** పాల్వంచ పట్టణంలోని జాతీయ రహదారి పక్కన గల వేణుగోపాల్ థియేటర్ ప్రాంగణంలో ఈ నెల 19 నుండి 21వ తేదీ వరకు కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శ్రీ పరాభవ నామ తెలుగు సంవత్సర -- 2026, ఉగాది వేడుకలకు సంబంధించి బ్రోచర్లు బుధవారం ఆవిష్కరించారు. ఉత్సవాల్లో ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ సంగీత విభావరి ఉండనున్నట్లు తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుండి కవులు, కళాకారులు ఉత్సవాలకు హాజరు అవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళా పరిషత్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ బిక్కసాని సుధాకర్, అధ్యక్షుడు మంతపురి రాజు గౌడ్, గౌరవ సలహాదారులు కొత్త వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి వేముల కొండలరావు, డాక్టర్ బుచ్చయ్య, లింగమూర్తి, శీరంశెట్టి కాంతారావు, సాంబశివరావు, చలువాది ప్రకాష్, సంపత్ కుమార్, అప్పలాచార్యులు, నరసింహమూర్తి పాల్గొన్నారు.



